# అగోచరుడు

## 1

కేశవదాసు, అతనిభార్య అన్నమ్మ, యిద్దఱు పిల్లలు క్రిష్టమస్ సెలవలకి పట్నం వచ్చారు. దాసుకి సికింద్రాబాద్‌లో కత్తులు-కటారులు తయారుచేసే ఫ్యాక్టరీలో వుద్యోగం పట్నంలో అతనికి స్నేహితులు, చుట్టాలు లేరు. భార్య ప్రోత్సాహంమీద ఒక పెద్దయిల్లు– వుండదలుచుకొన్నది పదిహేనురోజులేఐనా- మొత్తంగా అద్దెకు తీసుకోవాలని సంకల్పించుకొన్నాడు ఆఖరికి వారికి నచ్చిన గృహం కనిపించింది.

"అంతా మీకిందే వుంచుకోవచ్చుగాని దొడ్డివైపు మూలగదిలో మాత్రం వో బ్రహ్మచ్చారి కాపర ముంటున్నాడు. అద్దెయివ్వడం, గదిలో సామానులు పెట్టుకోవడం తప్ప అతనెప్పుడూ యిక్కడికి రానేరాడు. అతని నడిగి మీరుండే పదిరోజులూ యీ గదిలోకి రాకుండా వుండడానికి వీలైతే యిల్లంతా మీరే వాడుకోవచ్చు." అని యింటావిడ చెప్పింది. దానికి దాసు వొప్పుకున్నాడు. రెండుఘంటలలోనే ఆ బ్రహ్మచారి గది తనకి అవసరంలేదనీ, తనకి అక్కడికి రావలసిన పని లేదనీ చెప్పాడన్న వార్త దాసుకి చెప్పగా దాసు వారికొరకే మాత్రం త్యాగం చేసిన అతనికి అభివందనాలు తెల్పుకొన్నాడు.

రాత్రి భోజనాలయింతర్వాత అన్నమ్మ దొడ్డివైపు షికారుగా బయలుదేరింది. పూర్తిపేరు అన్నపూర్ణమ్మ స్కూల్ ఫైనల్‌దాకా చదువుకున్న దవడంవల్ల అపేరు అన్నా అని మార్చుకుంది. నామధేయంలో అలాంటిమార్పు చెయ్యడం దాసు అభిమతంమీద అవసరంగా తోచింది.

మనిషి చూడగానే మిరుమిట్లుగొల్పేటంత అందమైంది కాకపోయినా విదానంమీద పరిక్షించిన వారికి చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. హైదరాబాదులో వుండడంవల్ల మహమ్మదీయ సాంప్రదాయమైన నాజూకైన దుస్తులు ఆమె శరీరానికి క్రొత్త శోభను కల్పించాయి. జుట్టు మామూలు

సాఫీగా వుండే రకానికి చెందినా పిన్నులు గుచ్చడంవల్ల, రోజూ ఒకే పద్ధతిలో వెంట్రుకలను మెలిపెట్టి అర్ధచంద్రాకారంగా చుట్టడంవల్ల సహజమైన ఒంగిల జుట్టేమోనన్న సందేహం కలుగచేస్తుంది. చిన్న చామంతి పువ్వంత లోలకు ఒక్క చెవికి మాత్రం వుంది. ఎడమవైపు పాపిడితీసే చోట గాయంపడ్డంవల్ల పాపిడి కుడివైపున తీస్తుంది. క్రితం శెలవులకి భర్త తన్ను బొంబాయి తీసికెళ్ళినా ఊరంతా సరదాగా పిల్లలతో తిరిగేందుకు విసుగు తెప్పించడంవల్ల యీసారేనా పట్నమంతా తన్ను, పిల్లలనీ త్రిప్పుతాడని అనుకోలేదు. నిజానికి ఆమెకు కూడా పట్నం చూడాలన్న సరదా లేనేలేదు. సంసారిక జీవనంలో ఆమె కెల్లాంటి లోటు కనిపించకపోయినా యేదో చెప్పరాని బెంగవల్ల బాధపడుతున్నట్టుగా వుంటుంది. ఆమె చేసుకున్నది మేనరికం. అన్నివిధాలా కావలసిన సంబంధం. దాసు కురూపికూడా కాదు. ఐనాసరే యేదో అసంతృప్తి ఆమె తనకళ్ళను పదేపదే చిట్లించడంలో కనిపిస్తుంది.

దీనికి ముఖ్యమైన కారణం ఆమెది కవిహృదయం. ఆమె కవిత్వంలో మృదువైన నూత్నభావాలు చాలా వున్నా పద్యాలకు వరసా, వాయి సరైన యతిప్రాసలు లేకపోవడంవల్ల ఆమె "అ" అన్న పేరుతో పంపిన పద్యాలను పేరుపడ్డ పత్రికలు నిరాకరించాయి. జీవితం ప్రతి నిమిషం మధురంగా చేసుకోవాలని ఆమె ఆదర్శం. అందులకు పిల్లా, మేక సంసారం ఆమెకు అడ్డం తగిలాయి ప్రేమించిన ఒక వ్యక్తితో వెన్నెల రాత్రిళ్ళలో యిసుక తిన్నెపై విహారం చెయ్యాలనీ,— యేవో చెప్పరాని వింత ఆశయాలు చాలా వున్నాయి. ఆమె దైన్యానికి అన్నిటికంటె ముఖ్యమైన కారణం భర్త దాసు చేసే వుద్యోగమే. కత్తులు, కటారులు, మందుగుండు సామాను— వీటిలో యేం కవిత్వం ముంది? కవి యెప్పుడూ నూత్న శృంగారం, నవీన ఆవేశం సృష్టిస్తో వుంటాడు. తన భర్తసృష్టించే సామాగ్రి అంతా ఆనందమయ ప్రపంచాన్ని నిర్మూలం చేసేటందుకని ఆమె తలంపు, యుద్ధం, రక్తం, ఎముకలు, నిప్పు— వీటిమీద వచ్చే ఆదాయంతో భర్త ఆమెను పోషిస్తున్నాడు.

సెలవలకి భార్య పోరు పడలేక పట్నంవచ్చినా దాసు ఆమెకు వూరు చూపించడానికి మారుగా అక్కడుండే ఫ్యాక్టరీలు పరిశీలించి క్రొత్త విషయాలు తెలుసుకోడమే ఆదర్శంగా ఎంచుకొని వూళ్ళోకి వెళ్ళాడు.

బ్రహ్మచారిదని చెప్పబడిన గదిలోకి ఆమె ప్రవేశించింది. గదంతా చిందరవందరగా వుంది. ఓమూల పుస్తకాలకట్టలు, ఓమూల కాగితాలచెత్తా ఓమూల పటాలు—చాలా గొడవగాను, అక్కర్లేక గిరవాటెట్టినట్లుగాను, వుంచ బడ్డాయి ఇంతలో యింటావిడ ప్రవేశించింది.

“మీకేం కావలసినా నాతో చెప్పండి, అన్నమ్మగారు! మీకు కావలిస్తే యీగదిలో వున్న పుస్తకాలు చదువుకోవచ్చు.” అని చెప్పింది. సరేనని నవ్వుకుంటూ అన్నా పుస్తకాలు చూడడం మొదలెట్టింది అందులో సిరాతో వ్రాయబడిన వొక పుస్తకము తీసి చదవడం ప్రారంభించింది. మొదటిపేజీపై “అవాంతరం” అని వ్రాసి వుంది. అంకితం-నే నెన్నడూ చూడబోని విచిత్రవ్యక్తికి—” అని వుంది. అన్నా వుత్సాహం యెక్కువయి పద్యాలను చదవటం ప్రారంభించింది. ఇంతలో ముసలమ్మ తనంతట తానే అందుకుంది.

“ఈగదిలో వుండే అతను వ్రాసిన పద్యాలేనమ్మా మీరు చదివేవి. అతను కవి. ఎప్పుడూ యేవో రాస్తూనే వుంటాడు. చాలా విచిత్రమైన మనిషి....”

“అంటే”

“ఎక్కడి కెడతాడో, ఏం వుద్యోగమో, యెవ్వరికీ తెలియదు. మా గదిలో వుండకపోయినా నెలకోసారి వచ్చి అద్దెమాత్రం యిస్తో వుంటాడు. వొద్దన్నా వినడు. చాలా మంచివాడు. వొచ్చినప్పుడల్లా రాత్రంతా మేలుకుంటూ, ఏవో పాడుకుంటూ, తనలోతాను నవ్వుకుంటూ వుంటాడు తను మాట్లాడుతోనే వుంటాడు. మళ్ళా నేనేదేనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పడు. చాలా విచిత్రమైన....”

“వయస్సెంతుంటుంది?”

“పాతికి, ముప్ఫై లోపు—పైకి పిచ్చాడిలాగా వుంటాడు. నే నను

కున్నా మీకు పద్యాలూ అవీ వ్రాయడం యిష్టంకాబోలునని- అందుకనే అతవిని గురించి అడుగు తున్నారని...."

"బాగుంటాడా?"

"చాలామంది బాగుండ డంటారుకాని నాకళ్ళకి చక్కగా నాజూకైన ఆడమొహం అతనూ బాగానే వుంటాడు. కాని...."

అన్నాకి తనకి కావలసిన విషయాలన్నీ తెలుసుకున్న తర్వాత ముసలిది పోతే బాగుండు ననిపించింది తన యిష్టానుసారంగా గదిలో ప్రతి వస్తువునీ పరకాయించడానికి ముసలమ్మవునికి కొంత అంతరాయమే.

నేవెళ్ళి పరుంటాను అని అన్నా కొంతదూరం వెళ్ళంతర్వాత మళ్ళా కేకేసి

"అతను ఈమధ్య యెప్పుడేనా వస్తాడా?"

"ఏమో రేపుకాని చెప్పలేను."

రాత్రంతా అన్నా ఊహాప్రపంచంలో "అవాంతరం" అన్నపేరు చాలా చురుకుగా విహరించింది. ఆ పేరుని చాలామార్లు పత్రికలలో చదివినట్టు ఆమెకు గుర్తు. మరునాడు భర్త యథాప్రకారం వూళ్ళోకి వెళ్ళాడు. పిల్లల్ని బంట్రోతు కప్పగించి అన్నా మళ్ళా దొడ్డివైపుగదిలో ప్రవేశించింది. పుస్తకాలను చూడడం మొదలెట్టింది. ఒక దానిలో "నేడే మన రేపు" అన్న పద్యం వుంది. దాంతో అన్నా సంశయాలు తీరిపోయాయి. ఆమె చాలాకాలంనుంచి చూడ్డానికి తహతహ లాడుచున్న కవి ఈపద్యం వ్రాసిన వ్యక్తే. అన్నా పంపిన పద్యాలలో ప్రచురింపబడింది. "నేడు, రేపు" అన్న పద్యం వొక్కటే, ఒకే సంచికలో ఒకేపుటమీద ఆమె వ్రాసిన "నేడు-రేపు" అన్న పద్యం, యీకవి వ్రాసిన "నేడే మనరేపు" అన్న పద్యం "ఈరెండుపద్యాల సందేశం వొకటే కావడంవల్ల "అ" వ్రాసిన పద్యం "అవాంతరం" వ్రాసిన పద్యమంత వుత్కృష్టమైనది కాకపోయినా ప్రకటించడమైనది"—అన్న సంపాదకుని వ్యాఖ్యానంతో ప్రచురింపబడిన సంగతి జ్ఞాపకం తెచ్చుకుంది, ఈ "అవాంతరం" మీద ఆమె మనస్సు పరుగెత్తడం ఆరంభమైంది.

ఇంతలో ముసలమ్మ గదిలో కొచ్చింది.

"అవాంతరం" అంటే ఏమిటమ్మా."

"మీ రిక్కాదేవున్నారే! రేపు "అవాంతరానికి" కావలసిన పుస్తకా లేవో తీసుకెళ్ళడానికి వస్తానని కబురంపడంచేత గది వూడుద్దామని వచ్చాను...."

"నిజంగా రేపు వస్తాడా....? అతన్ని నాకు చూపించగలవా.... "అవాంతరం" అంటే యేమిటో చెప్పావు కాదు "

"ఏమో నాకు తెలీదు. అంతా అల్లాగే పిలుస్తారు. బహుశ యింటి పేరై వుంటుంది.... అతని పేరేదో గమ్మత్తుగుంది. మరిచిపోయానమ్మా"

"సరే పోనీ కాని, అతని ఫోటో యేదేనా వుందా యిక్కడ."

ముసలమ్మ చెత్తలోంచి నలిగిపోయిన పాతఫోటో నొకదాన్ని తీసి యిచ్చింది. గది వూడ్చి బైట కెళ్ళింది.

"రేపు తప్పక చూపించాలి సుమా...."

అన్న అప్పటి కింకా స్నానం చెయ్యలేదు ఆ ఫోటోని చీదరబట్ట లతో చూడడాని కిష్టంలేక సావధానంగా మధ్యాహ్నం చూద్దామనుకుని తన పుస్తకంలో దాచుకుంది.

మధ్యాహ్నమల్లా భర్త యింట్లోనే వుండడంవల్ల చూడ్డానికి వీల్లేక పోయింది.

సాయంత్రం చాలా పొద్దు పోయింతర్వాత కాని రానని చెప్పి దాసు బైటి కెళ్ళాడు. అన్న రెండోమారు స్నానంచేసి కొత్తబట్టలు ధరించి శృంగారంచేసుకొని పిల్లల్ని పడుకోబెట్టి అద్దంముందు కూర్చొని అతి జాగ్రత్తతో ఫోటో పైకి తీసింది. అది చాలామంది స్నేహితులతో తీసికొన్న ఫొటో! ముసలమ్మ గుర్తుగా అవాంతరం ఫొటోమీద చుక్క పెట్టింది. అతనిఫొటో ఆమె కళ్ళకి చాలా బాగుంది. మధ్య పాపిడి, గడ్డం మీద చిన్ననొక్కు, దీనంగా చూసే కళ్ళు ఆమె శరీరాన్ని పులకరించే టట్లు చేశాయి. తనకి తెలియకుండానే మోహంలో పడిపోయింది. ఆ కవి యేదుస్తులు ధరించేది, యేస్నేహితులలో మాట్లాడేది, యేస్త్రీలు ఆతని ప్రేమపద్యాలకు కారకులైంది వూహించుకుంటూండగా పిల్లాడు కదుల్తాడు తర్వాత కొంతసేపు తనలో తర్కించుకుంటుంది. ఇద్దరు పిల్లలతో పరా

యివాణ్ణి యిట్లా ప్రేమించటం భర్తకు ద్రోహం చెయ్యడం కాదూ? ఎంత కుటిలమైన భావాలు ఆమెను బాధిస్తున్నాయి? ఐతేం, తను ప్రేమించింది కవిని కదా.... తనకు కవిత్వమంటే చాలా యిష్టం పైగా వీరిద్దరి భావాలు అన్నివిధాలా ఏకీభవించాయి.

మనిషికూడా వొక్కమీసాలకి మినహాగా తను కోరినట్లే వున్నాడు. తన సౌందర్యాన్ని చూచి అతను మోహిస్తాడా అన్న సందేహం వొచ్చి అద్దంలో చూచుకుంది.... తప్పక ప్రేమిస్తాడు. సహజీవనం సంసారబాధ్యతకి, ఊహప్రపంచంలోని మధురజీవనానికి సంబంధం లేదు. దేవి కదే. కావలసిన కోర్కెలను అది చెల్లించుకో ప్రయత్నించటమే జీవితపరమావధి. హృదయానికి చల్లదనం, శాంతి, ఆనంద మిచ్చిన వ్యక్తిని ప్రేమింపకపోతే జీవితం వృథా....అనుకుంటూ తనను మరచిపోయి ఆఫొటోని తన పెదవుల కానించుకుంటుంది. ఇంతలో గది తలుపు చప్పుడు.

"వొస్తున్నా" అని ఖంగారుపడి ఫొటోని యేంచెయ్యడానికి తోచక మంచం దగ్గర కెడుతుంది. "ఏమిటంత ఆలస్యం అని బిగ్గరగా భర్త. "అబ్బ వొస్తున్నా, బట్ట కట్టుకుంటున్నానండి." అని ఆ ఫొటోని పరుపు కింద దాచి తలుపుతీసింది.

"ఇంత తొందరగా వచ్చారే?"

"ఏంలేదు. రేపు చాలా ప్రొద్దున్నే లేచిపోవాలి."

"పాపం చాలా శ్రమపడుతున్నారు." అంది.

"ఇవాళ తలకాయ నొప్పిగా వుంది."

అన్నా అతని తలకి నూనె మర్దనా చేస్తూ అతని నుదురు ముద్దాడుతూ నిదుర పుచ్చుతుంది.

## 3

ఉదయం ఐదుగంటలకే దాసు ప్రక్కమీద దొర్లి లేవబోతుంటే, వీపుక్రింద టపటపమన్న శబ్దం వినిపిస్తుంది. భార్య లేవకుండా పరుపెత్తి ఫొటో పైకితీసి చూస్తాడు. ఇంతలో అన్న కూడా లేచి ఆవలిస్తుంది.

"అప్పుడే లేచారే, పడుకోండి...."

"ఈఫొటో యెక్కడిది? ఇక్కడి కెల్లా వొచ్చింది?"

"ఏమో సద్దేటప్పుడు యింటిది యిక్కడ పెట్టి మరిచిపోయిందేమో"

దాసుకి భార్య మాట్లాడినప్పుడేతప్ప మాట్లాడడం అలవాటులేదు. అతను తనపనిమీద వెళ్ళాడు. తెల్లారిం తర్వాత అన్నా గదిలో కెళ్ళి ఆ కవి పుస్తకాలను చూచి ఆనందిస్తూండగా ముసలమ్మ వొస్తుంది.

"వచ్చాడా?" అని చాలా ఆతృతతో ప్రశ్నిస్తుంది అన్నా.

"లేదమ్మా. సాయంత్రం కాని రాడట."

o o o

ఆరోజు మధ్యాహ్నం యెన్నడూలేనిది దాసు అన్నాని కూడా తనతో వినోదాలు చూడడానికి రమ్మంటాడు ఆశ్చర్యపడి మొదట వొప్పుకుంటుంది తర్వాత ఆసాయంత్రం తనకి, తనహృదయసీమ నాక్రమించుకున్న కవికి జరగబోయే సమావేశం జ్ఞాపకం తెచ్చుకుని. "నాకివాళ వొంట్లో బాగాలేదు. మీ రెళ్ళండి." అంటుంది. ఆసాయంత్రంకూడా కవి రాలేదు.

"ఏమోనమ్మా ఈసారి కబురుకు జవాబైనా పంపలేదు ఏదేనా వూరెళ్ళాడేమో." అంటుంది ముసలమ్మ విచారంతో.

"పోనీ ఎక్కడుంటాడు."

"ఏమో ఫలానచోటని చెప్పలేం బహుశ వూళ్ళో వుండివుండడు."

తనవుత్సాహం అంతా చచ్చిపోవడంవల్ల పిల్లల్ని కూడా సరిగా చూడడం మానేస్తుంది అన్నా. భర్తతో నేనా తప్పవిసరిగా మాట్లాడుతుంది. అంతే. పోనీ వొస్తాడేమోనన్న ఆశతో యేదో వొంకచెప్పి ప్రయాణం రెండు రోజులు అపుచేసింది. కావి రాలేదు. వాళ్ళు వెళ్ళక తప్పదు. తాము సికింద్రాబాదు వెళ్ళక పూర్వం ఆమె అతని ఫొటో, అడ్రెసు మాత్రం ముసలమ్మవద్ద తీసుకుంది.

## 4

అన్నా నెలరోజులయింతర్వాత "అవాంత" రావికి వుత్తరం వ్రాస్తుంది. క్రింద తన పక్కింటివారి చిరునామా తెల్పుతూ "అ" అని సంతకం చేసి జవాబు వెంటనే యిమ్మని కోరుతుంది. వారంరోజులకే యీ క్రింది జవాబు వొస్తుంది.

"అయ్యో. మీరు నన్ను చూడకపోయినా యింతగా ప్రశంసించి నందుకు చాలా కృతజ్ఞుడను. మీ నామమెప్పుదో ఒక్కసారి పత్రికలో చూచినట్లు గుర్తు. ఇహ నుంచి మీపద్యాలన్నీ చాలా శ్రద్ధతో చదువుతాను.

—అవాంతరం.

ఈఉత్తరం చూచుకుని తను "స్త్రీ"ని అని, అతనికి తెలియపర్చ నందుకు చాలా చింతించింది. అతనిని స్మరించుకుంటూ కృశించిపోతూ దినాలు గడుపుతోంది అన్నా.

ఒకరోజు వేసంగికిముందు దాసు బాల్యస్నేహితుడు ప్రసాద్ వాళ్ళ యింటి కొచ్చాడు. స్నేహితులిరువురు కలుసుకుని చాలా సంత్సరాల యింది. ప్రసాద్ చిత్రకారుడన్నసంగతికూడా తెలియదు దాస్‌కి. చాలాసేపు మాట్లాడుకున్న తర్వాత వారిసంభాషణలో అన్నాకూడా పాల్గొంది.

"మీరు పట్నం ఎప్పు డెడతారు? మీ రక్కడున్న సంగతి తెలుస్తే మేము "అవాంతరం"గా రున్న బసలో వారికి ఇబ్బంది కలిగించి వుండక పోదుమె." అంది.

"అవాంతరం, యెవరే యెప్పుడూ చెప్పావుకాదు?" అన్నాడు దాసు.

"ఎవరో కవిట, ప్రసాద్‌గారికి తెలిసే వుంటుంది."

"దీనికూ్కడా కవిత్వమంటే పిచ్చిలెండి" అన్నాడు దాసు నవ్వుతూ

"అవాంతరం— నాస్నేహితుడే నండి. రేపు వేసంగిలో నేను అతను అజంతాగుహలకి, వెళ్ళదలచుకున్నాం.

"అప్పుడు మాయింట్లో తప్పక దిగాలి. సుమాండీ" అంది అన్నా జాగ్రత్తగా "తప్పక" అన్నమాటమీద బరువు మోపుతూ.

"నే దిగుతా గాని అతనిమాట చెప్పలేనండి అతను చాలా వింత మనిషి. ఎవరి సంపర్కమూ అక్కర్లేదు. పరాయివాళ్ళన్నా, స్త్రీలన్నా భయం, సిగ్గునూ. నాకు స్నేహితుడన్నమాటే గాని, అతను మాట్లాడు తోంటే, అతనినీడ మాట్లాడుతోన్నట్లుగా వుంటుంది."

"ఎలాగైనా సరే తీసుకురావాలి"

o o o

వేసంగివస్తుంది. ఆరోజున భర్త యింట్లోలేదు. అతను యింట్లో లేనిరోజుల్లో ప్రసాద్, కవి, వొస్తే యెంత బాగుంటుందో ననుకుంటూ, వొచ్చినట్లుగానే భావించుకొని శృంగారం చేసుకుంటుంది, అన్నా.

ఆరోజున వుదయం వీధితలుపులు చప్పుడు, ప్రసాద్ కంఠం విని పించాయి అన్నాకి. ఆమె ఆనందానికి అంతేలేదు. తలుపు తియ్యకుండానే లోపలికి పరుగెత్తి స్నానం చేసి కొత్తబట్టలు ధరించుకుని, యెంత అం దంగా వుండగలదో అంత అందంగాను తయారయి నవ్వుతూ తలుపు తీస్తుంది. ఒక్క ప్రసాద్ మాత్రమే వున్నాడు బైట. అన్నా అనుభవిం చిన విషాదాన్ని వర్ణించటంకష్టం.

"ఏడీ మీస్నేహితు డేడీ"

"నే చెప్పేగా, చాలా విచిత్రమైనవాడని, ముందర వస్తానని, తరు వాత రాననీ చెప్పాడు."

"వస్తున్నామని వుత్తరంకూడా వ్రాశారు."

"అవునూ, కాని అతనికి వొంట్లో సరిగా లేదు."

"ఏం జబ్బు?"

"ఏజబ్బూ లేదు ఎప్పుడూ అలాగే వుంటాడు."

ప్రసాద్ని సత్కరించటంకూడా మర్చిపోయింది అన్నా. ఈమె ప్రవర్తనకి ఆశ్చర్యపడుతూ, ప్రసాద్ వెళ్ళిపోయాడు. అన్నా తలుపు పెద్దగా చప్పుడుడయ్యేటట్లు ఘడియేసి, మంచిదుస్తులు తీసేసుకుని, మాసిన బట్టలు ధరించి, చింపిరివేషం వేసుకుని, ఫోటోని తనవక్షంపైని ఆనించు కుని పరుంది.

## 5

ఏడాది గడిచింది. అన్నా మూడోసారి ప్రసవించింది; మొగశిశువు పుట్టాడు.

అది జరిగిన మూడునెల్లకి వొకరోజున తను పద్యాలుపంపే, మాసపత్రికలో, అనాంతరం, ఆత్మహత్య గావించుకొన్న వృత్తాంతం చదివింది. దానిలో

"అనాంతరం, ముందు కాబోయే గొప్ప కవులలో ఒకడని, మాస

పత్రికలో ప్రచురింపబడిన పద్యాలే చెపుతవి. అతని కవిత్వంలో వున్న మాధుర్యం, యితర కవుల కవిత్వంలో కన్పించదు. ఆత్మహత్య చేసుకునేంతటి దుర్బలత్వం, అతని కవిత్వంలో కనపించదు. అతడు మరణిస్తూ ఈ లేఖను వ్రాశాడు.

"నా చావుకి యెవరూ బాధ్యులుకారు. నేను నా జీవితమంతా ఒక వ్యక్తికోసం ధారపోసినాను. అవ్యక్తి నాకు లభించలేదు. తుదకు నన్ను కంటితోనైనా చూసి ఉండదు. ఆ వ్యక్తిలేని నా జీవితాన్ని నా కవిత్వం అంతా కలిపినా మరణాన్నుండి తప్పించలేదు. ఈ లోకం నాబోటి లోలోన ప్రేమించి బ్రదికే కవులకు సరైన స్థానం కాదు...."

ఇదంతా లెక్కలేనన్నిసార్లు చదువుకుని గదిలోకెళ్ళి యేడవడం సాగించింది. తలగడా అంతా, ఆమె కన్నీటిధారచే తడిసింది. ఇంతలో దాసు ప్రవేశించి ఈమె విచారానికి ఆశ్చర్యపడతాడు. పత్రిక చదివి విషయమంతా గ్రహించుకుంటాడు. ఆమె చేతులోవున్న ఫోటోను కూడా చూస్తాడు.

"నువ్వు యెవడో పరాయివాడి కోసం యింతగోల చెయ్యవచ్చునా, అన్నా? లోకంలో యెందరు చావడం లేదు?"

"మనం చచ్చినా అతను అట్లాయేడ్చేవాడే....అయ్యో....?"

"చాల్లే! కట్టిపెట్టు – వాడితో నువ్వు కూడా చావ రాదు?"

"ఇప్పుడేం లాభమండి. నే ఫలానా అని అతని కొక్కసారి తెలుస్తే అతను ఆత్మహత్య చేసుకునేవాడు కాడు. తుదకు నన్ను చూసినా సరిపోయేది" అర్థంలేని యేడుపు చాలాసేపు సాగింది.

దాసు ఫోటోని తీసుకుని సావిట్లోకొచ్చి ఉయ్యాలాలో ఉన్న ఏడాది పిల్లాడిని, ఫోటోలోని కవిని పోల్చి చూసి, యిద్దరికి నిజమైన పోలిక వుందని గ్రహించుకున్నాడు.

"ఛీ, ఫో, వెధవా, నువ్వు నాకు పుట్టలేదు."

అని వుయ్యాలాని తన్నాడు కింద పిల్లవాని యేడ్పుకు యెంత అర్థముందో పైన తల్లి యేడుపుకీ అంతే అర్థముంది.